ANN తెలుగు

Follow: @ANNTELUGU


REGISTERED NUMBER: APTEL/2014/58382

15-07-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 222 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD మంగళవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టులు


**గత ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదు**

- తప్పులు చేసింది కేసీఆర్.. మూల్యం చెల్లిస్తోంది మేము
- ఏపీ ప్రాజెక్టులు కడుతుంటే అడ్డుకోకుండా సహకరించారు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్
- రైతును రాజు చేయాలన్నదే మా లక్ష్యం: మంత్రి పొంగులేటి
- పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల

**ఖమ్మం, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు అండగా నిలిచిం దని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి కాపాడుకుంటామని ఉద్ఘాటించారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

- మూడు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు
- దత్తాత్రేయ స్థానంలో హర్యానా గవర్నర్‌గా ఆషిం కుమార్ ఘోష్

03



## తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

- కొలీజియం సిఫార్సుకు ద్రౌపది ముర్ము ఆమోదం
- ఇది వరకు త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా (ఏకే సింగ్)విధులు

02



## కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయే

- బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

03






## అటు సూర్యుడు ఇటు ఉదయించినా

# 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలుచేస్తాం

### మోదీ మెడలు వంచి కులగణన చేసే విధంగా చేసినం

బీఆర్ఎస్ హయాంలో బెల్ట్ షాపులు తెరిస్తే.. మేం రేషన్ షాపులు తెరిచాం

**పేదలు సన్నబియ్యం తింటుంటే.. బీఆర్ఎస్‌కు కడుపులో మంట..**

కాళేశ్వరమని కూలేశ్వరం కట్టారు.. వారిని ఉరితీసినా తప్పులేదు

మూడేళ్ళు ఎత్తున్నాయన ముఖ్యమంత్రిని అడ్డుకుంటాడా? .. పదేళ్ళలో దేవాదుల నుండి నీళ్ళు తేలేదేం?

తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదు.. తుంగతుర్తిసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రాష్ట్రవ్యాప్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం.. కేసీఆర్- జగదీశ్వర్ రెడ్డిలపై భగ్గు

**50 వేలతో తుంగతుర్తికి వస్తే.. 60 వేల మెజారిటీ ఇచ్చిండ్రు..**

- ఎలా గెలిచావో మర్చిపోయావా.. మందుల సామేల్ కు సీఎం రేవంత్ క్లాస్
- కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూసుకోవాలని హితవు..
- ఎమ్మెల్యే తీరుపై సీఎంచురకలు

02

*“బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బెల్ట్ షాపులు తెరిస్తే.. తమ ప్రభుత్వ హయాంలో రేషన్ షాపులు తెరిచామనిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పేదవాడు.. ఉన్నవాడు అనే తేడా లేకుండా అందరూ లైన్లో నిలబడి సన్నబియ్యం తీసుకుని కడుపునిండా తింటున్నారని.. ఇది చూసి బీఆర్ఎస్ నేతలు కడుపులో మంట పెట్టుకుంటున్నరని విమర్శించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.34.20 కోట్ల విలువైన పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.*

*- మహా, నల్లగొండ*

వివరాలు 2లో



## హస్తినలో నీళ్ల పంచాయితీ!

- జల వివాదంపై తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం పిలుపు
- రేపు హాజరు కావాలని కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్
- నీటి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని రేవంత్ పట్టు
- పోలవరంబనచర్ల అంశాలతో పాటు మరిన్ని చర్చకు వచ్చే చాన్స్

వివరాలు 2లో



## నాపై హత్యాయత్నం

- కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేశాం
- ఆమెకు బీసీల కట్టుబాట్లు, పదజాలం తెల్వదు: తీన్మార్ మల్లన్న
- తన ఆఫీస్‌పై విధ్వంసం సృష్టించారని మండలి చైర్మన్‌కు ఫిర్యాదు
- మల్లన్న ఇద్దరు గన్‌మన్లను సరెండర్ చేసిన పోలీసు శాఖ


వివరాలు 2లో



## గాంధీ భవన్ పై మహేష్ మార్క్

- వినూత్న కార్యక్రమాలతో ముద్ర
- ముఖాముఖి సక్సెస్

వివరాలు 2లో



పచ్చని కాపురంలో

## బుట్టబొమ్మ చిచ్చు

- డాక్టర్ ప్రేమాయణానికి భార్య బలి
- ఇన్ స్టా ఇన్ ఫ్లూయన్సర్ మోజుతో భార్యకు వేధింపులు
- విడాకులు ఇస్తానని బెదిరింపులు.. బాధతో డాక్టర్ ప్రత్యూష సూసైడ్
- వరంగల్ లో కలకలం

వివరాలు 3లో

బీఆర్ఎస్ హయాంలో

## బీర్ల కంపెనీలకు దొడ్డుబియ్యం

**80 శాతం వృథా అయ్యేవి**

**రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్**

**నల్లగొండ, మహా:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ ద్వారా ఇచ్చిన దొడ్డు బియ్యం 80 శాతం వృథా అయ్యేవని మంత్రి ఉత్తమ్ కుమారర్ రెడ్డి అన్నారు. దొడ్డు బియ్యం కోళ్ల ఫారాలకు, బీర్ల కంపెనీలకు వెళ్లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబి య్యం పథకం తీసుకొచ్చిందనీ.. ఇది చరిత్రలో నిలిచి పోతుందని తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి తిరుమల గిరిలో రేషన్ కార్డుల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు ఇది పండుగ రోజు అని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉగాది నుంచి దొడ్డు బియ్యానికి



బదులు సన్నబియ్యం ఇస్తున్నామని తెలిపారు. గత సర్కార్ దొడ్డు బియ్యం కూడా నాణ్యంగా ఇవ్వలేదని విమర్శించారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టామని మంత్రి ఉత్తమ్ తెలిపారు . కాంగ్రెస్ ప్రభుత్వం 10 లక్షల మందికి సన్నబియ్యం ఇస్తోందని చెప్పారు.



## నన్ను ఆనందపర్చండి..

- మీ కొంగు బంగారం చేస్తా : స్వర్ణలత భవిష్యవాణి
- మరో మహమ్మారి పొంచి ఉంది
- వర్షా లు ఫుల్.. పూజలు ఐదు వారాల జరపాలన్న అమ్మ వారు

వివరాలు 3లో




## దేశానికే ఆదర్శంగా అంగన్వాడీలు తీర్చిదిద్దుతాం

- సమష్టికృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్యం
- షోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తాం
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

02





# అటు సూర్యుడు ఇటు ఉదయించినా
# 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలుచేస్తాం

## మోదీ మెడలు వంచి కులగణన చేసే విధంగా చేసినం

బీఆర్ఎస్ హయాంలో బెల్ట్ షాపులు తెరిస్తే.. మేం రేషన్ షాపులు తెరిచాం

**పేదలు సన్నబియ్యం తింటుంటే.. బీఆర్ఎస్‌కు కడుపులో మంట..**

కాళేశ్వరమని కూలేశ్వరం కట్టారు.. వారిని ఉరితీసినా తప్పులేదు

మూడేళ్ళు ఎత్తున్నాయన ముఖ్యమంత్రిని అడ్డుకుంటాడా? .. పదేళ్ళలో దేవాదుల నుండి నీళ్ళు తేలేదేం?

తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదు.. తుంగతుర్తిసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రాష్ట్రవ్యాప్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం.. కేసీఆర్- జగదీశ్వర్ రెడ్డిలపై భగ్గు

**నల్లగొండ, మహా :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బెల్ట్ షాపులు తెరిస్తే.. తమ ప్రభుత్వ హయాంలో రేషన్ షాపులు తెరిచామనిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పేదవాడు.. ఉన్నవాడు అనే తేడా లేకుండా అందరూ లైన్లో నిలబడి సన్నబియ్యం తీసుకుని కడుపునిండా తింటున్నారని.. ఇది చూసి బీఆర్ఎస్ నేతలు కడుపులో మంట పెట్టుకుంటున్నరని విమర్శించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. సోమవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.34.20 కోట్ల విలువైన పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపులు తెరవలేదని.. బెల్ట్ షాపులు తెరిచారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తుంటే.. ఓర్వలేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయంటూ మండిపడ్డారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేస్తున్నామని.. బోనస్ సైతం ఇస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డు అంటే పేదవారి ఆత్మగౌరవం.. గుర్తింపు అని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. పేదల ఆకలి తీర్చే ఆయుధమే రేషన్ కార్డు అని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు నల్గొండ జిల్లాకు నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పామని.. ఈ హామీని తమ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. అయితే తమ ప్రభుత్వం రైతు భరోసా ఎగ్గొట్టిందంటూ దుష్ప్రచారం చేశారని ప్రతిపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతులకు రైతు భరోసా నగదు అందించామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు.

**2లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తాం**

తమ ప్రభుత్వం కొలువు తీరి రెండేళ్లు పూర్తయ్యే సరికి 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం.. ఆయన హయాంలోనే కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. కూలేశ్వరం ప్రాజెక్టు దగ్గరే వారిని ఉరి తీసినా తప్పు లేదన్నారు. ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా? అంటూ బీఆర్ఎస్ నేతలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

## మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

మూడు అడుగులున్న స్థానిక నేత ఎగిరెగిరి పడుతున్నారని సీఎం ఎద్దేవా చేశారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా తుంగతుర్తికి నీళ్లు ఎందుకు తేలేదంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని సీఎం సూటిగా ప్రశ్నించారు. తుంగతుర్తికి నీరు తేవడమంటే.. గ్లాస్‌లో సోడా పోసినట్లు కాదంటూ బీఆర్ఎస్ నేతకు ఈ సందర్భంగా చురకలంటించారు. దొర ముందు చేతులు కట్టుకుని గ్లాస్‌లో సోడా పోయడమే నీకు తెలుసంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై మండిపడ్డారు. సొంత మండలానికి ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీస్‌లే కాదు.. పోలీస్ స్టేషన్ సైతం తెచ్చుకోలేని ఘనత బీఆర్ఎస్ నేతలదంటూ వ్యంగ్యంగా అన్నారు. పోరాట యోధులను అందించిన గడ్డ నల్గొండ అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. నాడు గంజికి లేని మూడు అడుగుల నాయకుడు.. నేడు బెంజి కార్లలో తిరుగుతున్నారంటూ జగదీశ్వర్ రెడ్డిపై వ్యంగ్య బాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి సంధించారు. తెలంగాణలో కొత్తగా 3.58 లక్షల రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా 11.3 లక్షల మందికి లబ్ధి చేకూరతుందన్నారు. తెలంగాణలో మొత్తం 95. 56 లక్షల మంది రేషన్ కార్డులు అందుకున్నారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు, విప్ రామచంద్రనాయక్‌తో పాటు జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ హాట్ కామెంట్స్..

- వరి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ నెంబర్ 1- ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు బోనస్ ఇచ్చాం
- ఆడబిడ్డల ఆత్మ గౌరవం కోసం కానుకగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం- 200 యూనిట్ విద్యుత్ ఉచితంగా ఇస్తున్నాం
- 1000 మెగా వాట్ల ప్లాంట్లు ఆడబిడ్డలకు ఇచ్చి కోటీశ్వరులను చేస్తున్నాం..
- పెట్రోల్ బంకులను, సోలార్ ప్లాంట్లను కూడా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నాం..
- గతంలో అంబానీ, అదానీ చేసే వ్యాపారాలను మహిళా సంఘాలు చేసుకునేలా చేస్తున్నాం
- స్కూల్ పిల్లలకు బట్టలు కుట్టే కాంట్రాక్టులు కూడా మహిళలకు ఇస్తున్నం
- రైతు భరోసా ఇవ్వడంలేదని ఇంటింటికి వెళ్లి దొంగ ఏడ్పులు ఏడ్చారు
- 9 రోజుల్లోనే అందరికీ భరోసా పూర్తి చేశాం.. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ
- 1931 తర్వాత ఇండియాలో కులగణన చేసిన రాష్ట్రం తెలంగాణ
- మోదీ మెడలు వంచి కులగణన చేసే విధంగా చేసినం
- స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం
- పాలితులుగా ఉన్నోళ్లను పాలకులుగా చేస్తాం

# 50వేలతో తుంగతుర్తికి వస్తే.. 60 వేల మెజారిటీ ఇచ్చిండ్రు

## ఎలా గెలిచావో మర్చిపోయావా

మందుల సామేల్ కు సీఎం రేవంత్ క్లాస్

కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూసుకోవాలని హితవు

ఎమ్మెల్యే తీరుపై ముఖ్యమంత్రి చురకలు



**తుంగతుర్తి, మహా:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చురకలు అంటించారు. కాంగ్రెస్ కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూసుకోవాలని సూచించారు. కష్టసుఖాలలో కలుపుకుపోవాలని, కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకోవాల్సిన బాధ్యత నీపై ఉందని క్లాస్ తీసుకున్నారు. సోమవారం తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో సీఎం కొత్త రేషన్ కార్డుల పంపిణీని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో గత కొన్ని రోజులుగా బయటపడుతున్న వర్గ విభేదాలపై సీఎం పరోక్షంగా స్పందించారు. ఎమ్మెల్యేకు తనదైన శైలిలో చురకలు అంటించారు. తుంగతుర్తి కాంగ్రెస్ కార్యకర్తల గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు.

**ఎవరూ అధైర్య పడొద్దు..**

ఎమ్మెల్యే సామేలు కాంగ్రెస్ టికెట్ తీసుకుని రూ.50 వేలతో తుంగతుర్తికి వస్తే 60 వేల మెజార్టీతో గెలిపించారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూసుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు. కష్టసుఖాలలో కలుపుకుపోవాలన్నారు. ఒకరికి బాధ, ఒకరికి దుఖం ఉంటుందని.. కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకోవాల్సిన బాధ్యత నీపై ఉందని సామేలుకు క్లాస్ తీసుకున్నారు. ఎవరూ అధైర్య పడొద్దని కార్యకర్తలకు భరోసానిచ్చారు. గత ఎన్నికల్లో మందుల సామేలును గెలిపించే బాధ్యత కార్యకర్తలు తీసుకున్నారని.. రానున్న స్థానిక ఎన్నికల్లో వారిని గెలిపించే బాధ్యత పార్టీ తీసుకుంటుందని భరోసానిచ్చారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయన్నారు. నల్గొండలో నికార్సైన కార్యకర్తలు ఉన్నారన్నారు. ఇక్కడ కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు మధ్య వర్గ విభేదాలు నడుస్తున్నట్లు టాక్ నడుస్తోంది.

# కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టులు

## గత ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేదు

- తప్పులు చేసింది కేసీఆర్.. మూల్యం చెల్లిస్తోంది మేము
- ఏపీ ప్రాజెక్ట్‌లు కడుతుంటే అడ్డుకోకుండా సహకరించారు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్
- రైతును రాజు చేయాలన్నదే మా లక్ష్యం: మంత్రి పొంగులేటి
- పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల



(మొదటిపేజీ తరువాయి)

సోమవారం కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విడుదల చేశారు. జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి 1500 క్యూసెక్కుల సాగు నీటిని రెండో జోనుకు మంత్రులు విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఇవాళ సాగర్ రెండో జోన్‌కు సాగునీరు విడుదల చేశామని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్ట్‌లు అని అభివర్ణించారు. గత కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి భారంగా మారాయని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో చేసిన తప్పిదాలకు నేడు తమ ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోందని అన్నారు. గతంలో శ్రీశైలంపైన ఏపీ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లు కడుతుంటే అడ్డుకోకుండా కేసీఆర్ ప్రభుత్వం సహకరించిందని మండిపడ్డారు. ఆనాడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామని గుర్తు చేశారు.

**పంటకు ఎలాంటి ధోకా లేదు..**

ఆనాడు కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్ తప్పులు చేసి వాటిని ఇప్పుడు తమపై రుద్దాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. రైతులు పండించిన పంటకు పెట్టుబడిగా రైతు భరోసా, రూ.9 వేల కోట్లు ఇచ్చామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో సన్నవడ్లకు బోనస్ ఇచ్చామని మల్లు భట్టి విక్రమార్కపేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. 2,55,324 లక్షల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశామని తెలిపారు. గత ఏడాది కనీవినీ ఎరుగని వరదల కారణంగా సాగర్ మెయిన్ కెనాల్ పూర్తిగా కొట్టుకుపోయిందని, దానిని పునరుద్ధరించామని తెలిపారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటితో మొదటి పంటకు ఎలాంటి ఢోకా లేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుణ దేవుడి అండ ఉందని, ఇది శుభసూచకమని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పచేసినా.. తమ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడ్డామని నొక్కిచెప్పారు. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు అన్నదాతల ఖాతాలో వేశామని స్పష్టం చేశారు. రైతును రాజు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. కృష్ణా బేసిన్‌లో వచ్చే నీటితో మొదటి పంటకు ఎలాంటి ఢోకా లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుణ దేవుడి అండ ఉందని.. ఇది శుభసూచకమని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పచేసినా.. తమ ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడ్డామని చెప్పారు.

# హస్తినలో నీళ్ల పంచాయితీ!

- జల వివాదంపై తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం పిలుపు
- రేపు హాజరు కావాలని కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్
- నీటి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని రేవంత్ పట్టు
- పోలవరం-బనచర్ల అంశాలతో పాటు మరిన్ని చర్చకు వచ్చే చాన్స్

**హైదరాబాద్, మహా:** నీటి వాటాలపై తేల్చుకునేందుకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు హస్తిన పర్యటనకు రెడీ అయ్యారు. జల వివాదంపై చర్చకు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీకి కేంద్రం ఏర్పాట్లు చేసింది. ఈ నెల 16న (రేపు) ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు వీరిద్దరిని ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ భేటీకి హాజరయ్యేందుకు ఇద్దరు సీఎంలకు వీలవుతుందో లేదో తెలపాలని పేర్కొంది.

**కేంద్రంపై ఒత్తిడి తేవాలని..**

మరోవైపు కృష్ణా, గోదావరి వాటాల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై రాష్ట్రంలోని ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులు, ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని సీఎం కోరనున్నారు. ఇక ఏపీ సీఎం చంద్రబాబు నేడు ఢిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అక్కడికి చేరుకోనున్నారు. కేంద్రమంత్రులు అమిత్‌షా, అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్‌తో సమావేశం కానున్నారు.


**పోలవరం-బనచర్ల అంశాలతోపాటు..**

బనకచర్ల విషయం రాజకీయం కావడంతో సమస్యను రెండు రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా పరిష్కరించడం అంత తేలిక కాదన్న అభిప్రాయం ఉంది. అయితే ముఖ్యమంత్రులు ఈ అంశంపై కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో చర్చిస్తే.. తాత్కాలికంగా అయినా ప్రస్తుత వివాదానికి ముగింపు లభించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బనకచర్ల అంశంపై ఏపీలోనూ ఇప్పుడిప్పుడే అది అంత లాభదాయకమైన ప్రాజెక్టు కాదన్న చర్చ జరుగుతోంది. ప్రజాభిప్రాయం మేరకు చంద్రబాబు ప్రస్తుతం పూర్తిగా పోలవరంపైనే దృష్టి పెట్టి ఆ తర్వాత.. బనకచర్ల అంశాన్ని అందుకోవచ్చని.. ఇప్పటికి అంత దూకుడు చూపించకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

# తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్

## కొలీజియం సిఫార్సుకు ద్రౌపది ముర్ము ఆమోదం

### ఇది వరకు త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా (ఏకే సింగ్)విధులు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ హైకోర్టు కొత్త సీజేగా జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు కొలీజియం సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఇంతకు ముందు త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ పనిచేశారు. ఇక ప్రస్తుత తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలిజియం సిఫార్సు చేసింది


**గతంలో విధులు ..**

తెలంగాణ హైకోర్టు సీజేగా నియమితులైన అపరేష్‌కుమార్ సింగ్ (ఏకే సింగ్) 1965, జూలై 7న జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. అనంతరం 1990 నుంచి 2000 వరకూ ఉత్తర్ ప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తర్వాత 2001లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్ కుమార్ నియమితులయ్యారు.

# గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

## మూడు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

### దత్తాత్రేయ స్థానంలో హర్యానా గవర్నర్‌గా ఆషిం కుమార్ ఘోష్



**న్యూఢిల్లీ, మహా :** మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవా గవర్నర్‌గా టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును నియమించారు. హరియాణా గవర్నర్‌గా ఆషిమ్ కుమార్ ఘోష్ నియమితులయ్యారు. లద్ధాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ బీజీ మిశ్రా రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ఆయన స్థానంలో కవీందర్ గుప్తాను నియమించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి ప్రకటన వెలువడింది. వారు బాధ్యతలు స్వీకరించిన తేదీల నుంచే ఈ నియామకాలు అమలులోకి వస్తాయని ప్రకటనలో పేర్కొంది.

**ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా**

తెలుగు రాష్ట్రాల్లోని సీనియర్ రాజకీయ నేతల్లో అశోక్ గజపతిరాజు ఒకరు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఆయన విజయం సాధించారు. 1978లో తొలిసారి జనతా పార్టీ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించిన అశోక్, ఆ తర్వాత టీడీపీలో చేరారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందారు. 1983, 1985, 1989, 1994, 1999, 2009లో టీడీపీ తరఫున విజయం సాధించారు. 2014లో అదే పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేసి జయకేతనం ఎగురవేసి కేంద్ర ప్రభుత్వంలో పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దివంగత ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో అశోక్‌గజపతిరాజు పలు కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్టీఆర్ హయాంలో ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల మంత్రిగా, చంద్రబాబు హయాంలో ఆర్థిక, శాసనసభ వ్యవహారాలు, రెవెన్యూ శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. చాలా కాలంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నారు. 2024 ఎన్నికల్లో అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా గెలుపొందారు.

**ముగిసిన దత్తాత్రేయ గవర్నర్ ప్రస్థానం**

మరోవైపు గవర్నర్‌గా బండారు దత్తాత్రేయ పదవీకాలం ముగిసింది. 2019 నుంచి 2025 వరకు ఆయన గవర్నర్‌గా పనిచేశారు. 2019లో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా నియామకమైన ఆయన, ఏడాదిన్నరపాటు సేవలు అందించారు. అనంతరం హరియాణా గవర్నర్‌గా దత్తాత్రేయ నియమితులయ్యారు. అక్కడ దాదాపు నాలుగేళ్లపాటు సేవలందించించారు. గతంలో ఆయన 2014 నుంచి 2019 వరకు తెలంగాణలోని సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఉన్నారు. అంతకు ముందు వాజ్ పేయ్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు.

**ప్రొఫెసర్ అషిమ్ కుమార్ ఘోష్ ప్రస్థానం**

ప్రొఫెసర్ అషిమ్ కుమార్ ఘోష్ బంగాల్లోని హావ్‌డాకు చెందినవారు. ఆయన 1999 నుంచి 2002 వరకు బంగాల్ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2023లో హావ్‌డా లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. బంగాల్‌లో సంఘ్, బీజేపీ మూలాలను బలోపేతం చేయడంలో అషిమ్ కుమార్ ఘోష్ ముఖ్యమైన పాత్ర పోషించారని చెబుతారు. ఆయన ప్రస్తుతం బంగాల్‌లోని పార్టీ మార్గదర్శక్ మండల్‌లో ఉన్నారు.

**కవిందర్ గుప్తా రాజకీయ జీవితం**

కవిందర్ గుప్తా జమ్మూ కశ్మీర్‌లోని బీజేపీ అగ్ర నాయకుల్లో ఒకరు. 1993 నుంచి 1998 వరకు భారతీయ యువ మోర్చా జమ్మూ కశ్మీర్ విభాగానికి అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ తర్వాత 2005 నుంచి 2010 వరకు వరుసగా మూడుసార్లు జమ్మూ నగర మేయర్‌గా ఎన్నికయ్యారు. అనంతరం 2014లో జరిగిన జమ్మూ కశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో గాంధీనగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2015 మార్చి 19న జమ్మూ కశ్మీర్ శాసనసభ స్పీకర్‌గా నియమితులయ్యారు. 2018 ఏప్రిల్ 30న జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగాను బాధ్యతలు చేపట్టారు. 2018 జూన్ 19న, బీజేపీ పీడీపీతో పొత్తును తెంచుకోవడంతో గుప్తా ప్రమాణ స్వీకారం చేసిన 51 రోజుల తర్వాత ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు

# నన్ను ఆనందపర్చండి.. మీ కొంగు బంగారం చేస్తా...

## స్వర్ణలత భవిష్యవాణి

- మరో మహమ్మారి పొంచి ఉంది
- వర్షా లు ఫుల్.. పూజలు ఐదు వారాల జరపాలన్న అమ్మ వారు



**సికింద్రాబాద్, మహా :** బోనాల జాతర మలిరోజు కార్యక్రమంలో భాగంగా ఉజ్జయిని మహంకాళి ఆలయంలో సోమవారం రంగం కార్యక్రమం ఘనంగా జరిగింది. రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. అమ్మవారి ఎదురుగా పచ్చి కుండపై నిలబడి స్వర్ణలత భవిష్యవాణి చెప్పారు. ఈ ఏడాది కూడా వర్షాలు బాగా కురుస్తాయన్నారు. తాను కోపంగా లేనని, తాను కన్నెర్ర చేస్తే రక్తం కక్కుకుంటారు అంటూ స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. 'నా భక్తులు సమర్పించిన బోనాలను సంతోషంగా అందుకున్నాను. కానీ ప్రతీ ఏడాది ఏదో ఒక ఆటంకం చేస్తూనే ఉన్నారు. ప్రతీ సంవత్సరం చెప్పినప్పటికీ నన్ను లెక్క చేయడం లేదు. ఏడాదికి ఏడాది నా కోరిక చెప్పినా నెరవేర్చడం లేదు. నా బిడ్డలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నాను. నా పూజలన్నీ నాకు సక్రమంగా జరిపించాలి. నా కోపానికి మీరు బలి అవుతారు.. కానీ నేను కోపం చూపించడం లేదు. నేను కన్నెర్ర చేస్తే మీరు రక్తం కక్కుకుని చస్తరు. నాకు పూజలు సరిగ్గా జరిపించడం లేదు.. అందుకే మరణాలు పెరుగుతున్నాయి.. కాలం తీరిందంటే ఎవ్వరు ఏది అనుభవించాలో అది తప్పక అనుభవిస్తారు. నేను దానికి అడ్డురాను. వేల రాసులు నేను రప్పించుకుంటున్న... నాకు రక్తం బలి ఇవ్వడం లేదు.. మీరు మాత్రం ఆరగిస్తారు.. నాకు మాత్రం ఇవ్వడం లేదు.. ఈ ఏడాది జరిపించకపోతే.. ఎవరెవరు అడ్డుపడుతారో వారిని రక్తం కక్కేలా చేస్తా. అందుకు నన్ను నిందించొద్దు. నన్ను కొలిచే వారు తప్పనిసరిగా విధివిధానంగా పూజలు జరిపించండి' అని ఆజ్ఞాపించింది అమ్మవారు. అయితే తల్లీ కోపం వద్దని.. సక్రమంగా పూజలు చేస్తామని ఆలయ పూజారులు అమ్మవారికి వాగ్దానం చేశారు.

**దేశాన్ని కాపాడే బాధ్యత ఉంది**

"ఈసారి దేశాన్ని కాపాడే బాధ్యత నాపైనే ఉంది. అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. మరోసారి మహమ్మారి విజృంభించే ప్రమాదం ఉంది. ముందుగానే ముద్దుగా హెచ్చరిస్తున్నాను. నా పిల్లలందరినీ కడుపులో పెట్టుకొని రక్షిస్తున్నాను. కానీ వారి తల్లిదండ్రులే కనికరం లేకుండా వారిని వదిలేస్తున్నారు. చిన్న చిన్న పూజలతో పెద్ద కోరికలు తీరుస్తున్నాను. ఇంకా ఎన్ని సంవత్సరాలు ఓపిక పట్టాలి చెప్పండి? ఏటేటా వాగ్దానాలు తీసుకుంటారు. కానీ ఒక్కసారి కూడా నిజంగా నిబద్ధత చూపించరు. అయినా కూడా నేను నా బిడ్డలను కాపాడుతూనే ఉన్నాను. ఈసారి బాలభారతాలు సంతోషంగా ఉంటారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. పంటలు బాగా పండుతాయి. ఈ జాతర ఐదు వారాలపాటు పప్పు, బెల్లం, ఫలహారంతో జరగాలి. పసుపు, కుంకుమలతో, వేపాకులతో శోభాయమానంగా ఉండాలి.నాలుగు వారాల్లో నా ఎదుట రక్తం చూపించండి. చూపించకపోతే నేను ఊరుకోను." అని హెచ్చరించారు. అమ్మవారి ఈ భవిష్యవాణి సికింద్రాబాద్ ప్రజలందరికీ ఆలోచన కలిగించేలా ఉంది.

# పచ్చని కాపురంలో బుట్టబొమ్మ చిచ్చు

- డాక్టర్ ప్రేమాయణానికి భార్య బలి
- ఇన్ స్టా ఇన్ ఫ్లూయన్సర్ మోజుతో భార్యకు వేధింపులు
- విడాకులు ఇస్తానని బెదిరింపులు.. బాధతో డాక్టర్ ప్రత్యూష సూసైడ్
- వరంగల్ లో కలకలం

**వరంగల్, మహా :** పర స్త్రీ వ్యామోహం పచ్చని కాపురాల్లో చిచ్చుపెట్టింది. సోషల్ మీడియా మోజులో ఇన్‌స్టా ఇన్ ఫ్లూయన్సర్ వ్యామోహంలో పడి.. భార్యను నిర్లక్ష్యం చేసిన డాక్టర్ సృజన్ బంగారం లాంటి కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసుకున్న పరిస్థితి రాష్ట్రవ్యాప్త సంచలనంగా మారింది. వరంగల్‌లో ప్రత్యూష అనే వైద్యురాలి ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. ప్రత్యూష హసన్‌పర్తిలోని తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ప్రత్యూష కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆమె భర్త సృజన్‌ను హసన్‌పర్తి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రత్యూష తల్లిదండ్రులు చెప్పిన వివరాల ప్రకారం.. ప్రత్యూష భర్త సృజన్ వరంగల్ మెడికవర్ హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రత్యూష మరో హాస్పిటల్‌లో వైద్యురాలిగా పనిచేస్తోంది. వైద్య వృత్తిలో కొనసాగుతున్న ఈ ఇద్దరూ పెళ్లైన కొంత కాలం బానే ఉన్నారు. వీళ్లకు పిల్లలు కూడా ఉన్నారు. ఒక ఇన్ స్టాగ్రాం ఇన్ఫ్లూయెన్సర్ మోజులో పడి సృజన్ తన కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశాడు. విడాకులు ఇస్తానని ప్రత్యూషను బెదిరించాడు. విషయం పెద్దది చేస్తే ఇన్ ఫ్లుయెన్సర్‌ను పెళ్లి చేసుకుంటానని బ్లాక్‌మెయిల్ చేశాడు. దీంతో.. ప్రత్యూషకు ఏం చేయాలో పాలుపోలేదు. భర్త మరో యువతి మోజులో పడి తనను, పిల్లలను నిర్లక్ష్యం చేయడంతో తనలో తాను కుమిలిపోయి ప్రత్యూష నరకయాతన అనుభవించింది. ఆ మానసిక ఒత్తిడి కారణంగా ప్రత్యూష ప్రాణాలు తీసుకుందని ఆమె కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.

**పరిచయం నుండి పెళ్ళిచేసుకుంటాననే వరకు**

సృజన్‌కు వరంగల్‌కు చెందిన ఒక ఇన్ స్టా గ్రాం ఇన్ఫ్లుయెన్సర్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెకు, సృజన్‌కు ఒక ప్రమోషనల్ ఇంటర్వ్యూ కారణంగా ఏర్పడిన పరిచయం ఇద్దరూ కలిసి చెట్టాపట్టాలేసుకుని తిరిగేంత వరకూ వెళ్లింది. భార్యాపిల్లలను పట్టించుకోకుండా ఆ ఇన్‌ఫ్లుయెన్సర్‌తో కలిసి సినిమాలు, షికార్లు.. ఇలా ఈ డాక్టర్, ఇన్‌ఫ్లుయెన్సర్ విచ్చలవిడితనానికి అంతూపొంతూ లేకుండా పోయింది. ఇన్ స్టాగ్రాంలో సదరు ఇన్‌ఫ్లుయెన్సర్ యువతికి 2 లక్షలకు పైగా ఫాలోవర్స్ కూడా ఉన్నారు. ఆమె చేసిన కొన్ని వీడియోలకు మిలియన్లలో వ్యూస్ ఉన్నాయి. నిన్నమొన్నొచ్చిన శ్రీలీల 'వైరల్ వయ్యారి నేను' పాటకు కూడా ఈ యువతి డ్యాన్స్ చేస్తూ రీల్ చేసి అప్ లోడ్ చేసింది. ఈ బుట్టబొమ్మ అందచందాలకు మైమరిచిపోయిన ఈ డాక్టర్ సృజన్ తన భార్యాబిడ్డలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రత్యూష చావే శరణ్యమని ఆత్మహత్యకు పాల్పడిందని, సృజన్ ఇలా చేస్తున్నాడని చెప్పినా అతని తల్లిదండ్రులు పట్టించుకోలేదని ప్రత్యూష తండ్రి మీడియా ఎదుట వాపోయాడు. తన కూతురి చావుకు కారణమైన సృజన్‌ను, అతని తల్లిదండ్రులను, సదరు ఇన్‌ఫ్లుయెన్సర్ యువతిని పోలీసులు కఠినంగా శిక్షించి ప్రత్యూషకు న్యాయం చేయాలని ఆమె తండ్రి వేడుకున్నాడు.



## కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం

# బీజేపీయే

### బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**నల్లగొండ, మహా :** దీర్ఘకాలంగా పార్టీ కోసం పని చేస్తూ పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావాలన్న తపనతో ఉన్న కాషాయ కార్యకర్తల కల త్వరలోనే నెరవేరబోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. నల్గొండ జిల్లాలో సోమవారం రామచందర్‌రావు పర్యటించారు. ఆయనకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ నేతలకు రాబోయే ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. గ్రామగ్రామాన బీజేపీ జండా ఎగరాలన్నదే తమ లక్ష్యమన్నారు. అర్హత ఉన్న అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలకే రేషన్ కార్డులు ఇస్తున్నారని.. మిగతా వారి పరిస్థితి ఏమిటనీ ప్రశ్నించారు. రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని స్పష్టం చేశారు. రేషన్ షాపుల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనేనని నొక్కిచెప్పారు. తమ కార్యకర్తల కళ త్వరలో నెరవేరబోతుందని ఉద్ఘాటించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గ్రామగ్రామాన కాషాయం జెండా ఎగరవేయాలని బీజేపీ శ్రేణులకు మార్గనిర్దేశం చేశారు. కాంగ్రెస్‌కి ఓట్లు వేసి ప్రజలు బాధపడుతున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలని నల్లగొండ జిల్లాను ఆ రెండు పార్టీల్లోని కుటుంబాలే పరిపాలిస్తున్నాయని విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్లను తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ పోరాడుతోందని స్పష్టం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను చూశారని.. బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని రామచందర్‌రావు కోరారు.

## కౌన్సిల్ లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపండి

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

### గ్రీవెన్స్ ఫిర్యాదుల పై వివిధ విభాగాల వారిగా సమీక్ష




**వరంగల్ మహా;** ఇటీవల కౌన్సిల్ లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారం పై శ్రద్ధ చూపాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమం అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్ ఫిర్యాదుల సమీక్ష పై నిర్వహించిన సమావేశంలో కమిషనర్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు వివిధ సమస్యల నిమిత్తం అధికారులకు ఫోన్ చేసే క్రమంలో అధికారులు స్పందించాలని, ఇటీవల శానిటేషన్ టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ విభాగాలలో బదిలీలు జరిగిన క్రమంలో అంతర్జాలంలో అట్టి సమాచారాన్ని సవరించాలని, గ్రీవెన్స్ కు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంలో అట్టి సమస్య గురించి క్షేత్రస్థాయిలో అధికారులు సందర్శించి పరిశీలన చేసి పరిష్కరించిన తర్వాతనే డాష్ బోర్డు నుండి తొలగించాలని, సెల్ఫ్ అసెస్మెంట్ లు మ్యుటేషన్ లకు సంబంధించి కనీసం 5% క్షేత్ర స్థాయి లో తనిఖీలు చేయాలని అన్నారు.ఈ సందర్భం గా టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ శానిటేషన్ మలేరియా విభాగాలకు సంబంధించి గత ప్రజావాణి కార్యక్రమం లో స్వీకరించిన ఫిర్యాదులు ఇంతవరకు ఎన్ని పరిష్కారం అయ్యాయి, మిగిలినవి ఎందుకు చేయలేకపోయారు అనే విషయాలను అడిగి తెలుసుకొని వేగవంతం గా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి డి ఎఫ్ ఓ శంకర్ లింగం వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు పన్నుల అధికారి రామకృష్ణ ఇన్చార్జి ఎస్ ఈ, సిటీ ప్లానర్ లు మహీందర్ రవీందర్ రాడేకర్ హెచ్ ఓ లు రమేష్ లక్ష్మారెడ్డి డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి ఏం హెచ్ ఓ డా.రాజేష్ హెచ్ ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# రైతుల భూమి జోలికొస్తే ఖబడ్దార్

### బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్

### గోశాలకి మేము వ్యతిరేకం కాదు.. సామాన్య రైతులు నష్టపోవొద్దు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మొయినబాద్ మండలం యెనికే పల్లి గ్రామ రైతులు గత కొన్ని రోజులుగా చేపట్టిన ఆందోళనకు బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ మద్దతు తెలిపారు. రైతుల భూములు తీసుకొని గోశాలకి కేటాయించడం కన్నా మరోచోట ఉపయోగంలో లేని భూములు కేటాయించాలని అన్నారు. ఎన్నో రోజులుగా సాగుచేసుకుంటున్న రైతుల నుండి ఉన్నపళంగా భూములు తీసుకుంటే వారి కుటుంబ సభ్యుల పరిస్థితి ఏంటి, వారి జీవనాధారం ఎలా అని ప్రశ్నించారు. రైతుని బాధ పెట్టిన ఏ ప్రభుత్వం బాగు పడదు, కొండలు గుట్టలుగా ఉన్న భూములను ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సాగు చేసుకుంటున్న రైతులను అర్ధాంతరంగా వెళ్లిపోమనడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి లేకపోతే బీజేపీ పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తోంది ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# గాంధీ భవన్ పై మహేష్ మార్క్

### వినూత్న కార్యక్రమాలతో ముద్ర

### ముఖాముఖి సక్సెస్

**హైదరాబాద్, మహా :** పీసీసీ చీఫ్ గా మహేష్ కుమార్ గౌడ్ విలక్షణ ముద్ర వేస్తున్నారు. తెలంగాణలో గాంధీ భవన్ ను కార్యకర్తలకు, ప్రజాసమస్యల పరిష్కారానికి అడ్రస్ గా మార్చారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టాక గాంధీ భవన్ నిత్యం నేతల రాకపోకలతో, కార్యకర్తల హడావుడి తో సందడిగా మారగా, పీసీసీ చీఫ్ గా బాధ్యతలు చేపట్టగానే మొదలుపెట్టిన మంత్రులతో ముఖాముఖికి మంచి స్పందన లభించింది. మంత్రులతో "ముఖాముఖి".. ప్రతి రోజూ ఇద్దరూ ప్రజాప్రతినిధులు అందుబాటులో కార్యక్రమాలు విజయ వంతంగా కొనసాగుతున్నాయి. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లతో పాటు ముఖ్య నేతలు ప్రజల్లో ఉండేలా కార్యక్రమాలు జరుగుతుండగా, ప్రతీరోజూ ప్రజలు పెద్ద ఎత్తున ఆయా నేతలను కలిసేందుకు వస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు.


**జై బాపు - జై భీమ్ - జై సంవిధాన్**

రాజ్యాంగ పరిరక్షణ కోసం ఏఐసీసీ పిలుపు మేరకు రాష్ట్రంలో 'జై బాపు జై భీమ్ జై సంవిధాన్' కార్యక్రమాన్ని కాంగ్రెస్ నేతలు మహేష్ కుమార్ గౌడ్ సలహాలతో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన ఉందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం టీపీసీసీ సరికొత్త ప్రణాళికలు అమలు చేస్తోంది. జిల్లాల ఇన్‌చార్జ్‌లు, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పరిశీలకులను నియమిస్తూ పకడ్బందీగా వ్యవస్థను సిద్ధం చేస్తున్నారు. జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి, నాయకులను ఎంపిక చేయడంలో పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్నారు. ఇక పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ పదవిలోకి వచ్చిన పది మాసాల్లో నిరంతరం పనిచేసే నాయకుడిగా, కార్యకర్తల భరోసాగా నిలిచారు.

# నాపై హత్యాయత్నం

## కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేశాం

- ఆమెకు బీసీల కట్టుబాట్లు, పదజాలం తెల్వదు: తీన్మార్ మల్లన్న
- తన ఆఫీస్‌పై విధ్వంసం సృష్టించారని మండలి చైర్మన్‌కు ఫిర్యాదు
- మల్లన్న ఇద్దరు గన్‌మన్లను సరెండర్ చేసిన పోలీసు శాఖ



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేశామని పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. తనపై హత్యాయత్నం జరిగిందని, ఈ విషయంపై శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. కవిత అనుచరుల విధ్వంసాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఆదివారం క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం మండలి చైర్మన్‌ను కలిసిన మల్లన్న దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అనుచరులు క్యూ న్యూస్ కార్యాలయానికి వచ్చి చేసిన విధ్వంసాన్ని చైర్మన్‌కు వివరించానని తెలిపారు.

**బీసీల కట్టుబాట్లు, పదజాలం తెల్వదు..**

డీజీపీని కూడా కలిసి ఫిర్యాదు చేస్తానని తీన్మార్ మల్లన్న వెల్లడించారు. కార్యాలయంపై దాడి నేపథ్యంలో తనకు రక్షణ కల్పించాలని చైర్మన్‌ను కోరానని వివరించారు. కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. దాడి ఘటనపై విచారణ జరుపుతామని మండలి చైర్మన్ హామీ ఇచ్చారని వెల్లడించారు. కవిత బీసీ నినాదం వినిపించడంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. బీసీల కట్టుబాట్లు, పదజాలం ఏమిటో కవితకు తెలియదని వ్యాఖ్యానించారు. బీసీల రాజకీయాన్ని నిలువరించాలనే ఉద్దేశంతోనే ఆమె ఈ నినాదం ఎత్తుకున్నారని ఆరోపించారు.

## మల్లన్న గన్‌మెన్లు సరెండర్..

మరోవైపు, క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి కేసు నేపథ్యంలో పోలీసు శాఖ తీన్మార్ మల్లన్నకు చెందిన ఇద్దరు గన్‌మన్లను సరెండర్ చేసింది. పోలీసు శాఖ ఇద్దరి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. తీన్మార్ మల్లన్న చెబితే తాము కాల్పులు జరిపామని పోలీసులు విచారణలో తెలిపారు. అంతకుముందు, తీన్మార్ మల్లన్న ఈ దాడిపై మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు కవితపై కేసు నమోదు చేశారు.

# దేశానికే ఆదర్శంగా అంగన్వాడీలు తీర్చిదిద్దుతాం

- సమష్టికృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్యం
- పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తాం
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా:** పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తుందని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. శక్తివంతమైన, ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అందరూ పాలు పంచుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. సమష్టికృషితోనే పౌష్టిక తెలంగాణ సాధ్యపడుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు దేశానికే ఆదర్శంగా తెలంగాణ అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతామని వెల్లడించారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ సేవల బలోపేతం, చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల, మహిళా స్వయం సహాయక బృందాల భాగస్వామ్యం వంటి అంశాలపై రాష్ట్ర స్థాయి సమావేశం సోమవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా వేదికగా ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మంత్రి సీతక్క అధ్యక్షత వహించారు.

**వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ..**

ఈ సమావేశంలో పోషకాహారంపై పనిచేస్తున్న మైసూర్, ఎయిమ్స్, ఇక్రిసాట్, యూనిసెఫ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రథం, ఆంధ్ర మహిళా సభ, హర్మన్, బాల రక్ష భారతి వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోషకాహారం అందించడంలో లైన్ డిపార్ట్ మెంట్లుగా వ్యవహరిస్తున్న పలు సంక్షేమశాఖలు, సివిల్ సప్లైస్, విద్యా శాఖ, టీజీ ఫుడ్స్, సెర్ప్, ఐ అండ్ పీఆర్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని తమ విలువైన అభిప్రాయాలు తెలియచేశారు. వారి అభిప్రాయాలను, అనుభవాలను, ఆలోచనలను ఆసక్తిగా విన్న మంత్రి సీతక్క వారి సూచనలతో 'తెలంగాణ పోషకాహార ప్రణాళిక' రూపొందిస్తామని ప్రకటించారు. అంగన్వాడీ లబ్ధిదారులకు రోజుకు 200 మిల్లీ లీటర్ల విజయ పాలు, కిశోర బాలికలకు పోషకాలతో కూడిన పల్లీ, తృణధాన్య పట్టీలు, వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి స్పష్టం చేశారు.

# ఏం చేసుకుంటారో చేసుకోండి.. ఇక్కడ నేనే జడ్జ్!

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- ఈనెల 11న షాబాద్ ప్రభుత్వ పాఠశాలలో దారుణం
- విద్యార్థిని బూటు కాలుతో తన్నిన హెడ్ మాస్టర్ గోవింద్
- కఠినంగా శిక్షించి ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయాలి
- విద్యార్థి సంఘాల నాయకులు తల్లిదండ్రులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఈనెల 11న షాబాద్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో దారుణం చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన. విద్యార్థిని చితకబాది, బూటు కాలితో తన్నిన హెడ్మాస్టర్ గోవింద్ పై గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన షాబాద్ గ్రామ ప్రజలు. అయినా అతని రీతిలో మార్పు రాకపోవడం గమనార్హం అని స్థానికులు వాపోతున్నారు. నా స్కూల్ నా ఇష్టం నువ్వు ఎవరు మాట్లాడడానికి అంటూ విద్యార్థుల తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగినట్లు షాబాద్ గ్రామం ప్రజలు తెలిపారు.

**మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు చేస్తాం...**

పిడిఎస్యు విద్యార్థి సంఘం నాయకులు రాజేష్ పాఠశాలను సందర్శించి జరిగిన ఘటనపై విద్యార్థిని అడిగి విషయం తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల హెడ్ మాస్టర్ గోవింద్ తీరే వేరుగా ఉంది. ఈనెల 11న 6వ తరగతి విద్యార్థి మరో విద్యార్థి కలిసి గొడవ పడుతున్న తరుణంలో మరో విద్యార్థి వెళ్లి హెడ్ మాస్టర్ కు ఫిర్యాదు చేయగా, అతను వచ్చి రాకేష్ అనే విద్యార్థిని ఇష్టం వచ్చినట్లు చితకబాది, కింద పడేసి బూటు కాలుతో తొక్కుతూ, దుర్భాషలాడుతూ ఇష్టానుసారంగా వ్యవహరించడం జరిగిందని విద్యార్థి సంఘం నాయకులు రాజేష్ అన్నారు. ఇంతటి దారుణానికి ఓడిన హెడ్ మాస్టర్ గోవింద్ ను కఠినంగా శిక్షించి వెంటనే విధుల నుంచి తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, హెడ్మాస్టర్ గోవింద పై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. షాబాద్ లో జరిగిన సంఘటనపై త్వరలో మానవ హక్కుల కమిషన్ను కలిసి ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు.



### కేరళలో తెలుగు కుర్రాడి అల్లరి..
## 'కె ర్యాంప్' గ్లింప్స్ రిలీజ్

'క' సినిమాతో గతేడాది హిట్ కొట్టిన కిరణ్ అబ్బవరం.. ఈ ఏడాది 'దిల్‌రుబా' మూవీతో చాన్నాళ్ల క్రితమే వచ్చాడు. ఇది ఘోరమైన డిజాస్టర్ అయింది. ప్రస్తుతం రెండు మూడు సినిమాలు చేస్తున్నాడు. వాటిలో 'కెర్యాంప్' పేరుతో తీస్తున్న ఓ చిత్రముంది. ఇప్పుడు దాని గ్లింప్స్ రిలీజ్ చేయడంతో పాటు మూవీ రిలీజ్ డేట్ కూడా ప్రకటించారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో హీరోగా పరిచయమైన కిరణ్ అబ్బవరం.. తర్వాత చాలా సినిమాలు చేస్తూ వచ్చాడు కానీ హిట్స్ కొట్టలేకపోయాడు. రెగ్యులర్ రొటీన్ కమర్షియల్ చిత్రాలతో ప్రేక్షకుల్ని విసిగించాడు. ఎట్టకేలకు 'క' అనే థ్రిల్లర్‌తో హిట్ కొట్టాడు. మరి ఆ సెంటిమెంట్ ఫాలో అవుతున్నాడో ఏమో గానీ క అక్షరం కలిసొచ్చేలా 'కెర్యాంప్' సినిమా చేశారు. దీని గ్లింప్స్ ఎంటర్‌టైనింగ్‌గా ఉంది. గత చిత్రాలతో పోలిస్తే కిరణ్ ఎనర్జిటిక్‌గా కనిపిస్తున్నాడు. ఇందులో కిరణ్ అబ్బవరం సరసన యుక్తి తరేజా హీరోయిన్. జైన్స్ నాని దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. గ్లింప్స్ బట్టి చూస్తుంటే సినిమా అంతా కేరళలో షూట్ చేశారు. ఈ అక్టోబరు 18న థియేటర్లలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు.

## బండ్ల గణేశ్ పోస్ట్‌పై విమర్శలు..



కామెడీ పండిచడం చాలా కష్టమంటుంటారు. కానీ కోట శ్రీనివాసరావు అవలీలగా నవ్వించేయగలరు, గణేశ్ లాంటి సినిమాలతో భయపెట్టనూగలరు. ఇవి రెండూ మిక్స్ చేసేలా భయపెడుతూనే నవ్వించగలరు. 750కి పైగా సినిమాలు చేసిన ఆయన ఇక సెలవంటూ వెళ్లిపోయారు. జూలై 13న ఫిలిం నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఒక్కసారిగా మూగబోయింది.

**భగవంతుడు పిలుస్తాడని అప్పుడే అనుకున్నా..**

నటుడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సినీతారలు భావోద్వేగానికి లోనయ్యారు. నిర్మాత బండ్ల గణేశ్ సైతం కోట ఇంటికి చేరుకుని ఆయన పార్థివదేహానికి నివాళులర్పించాడు. కొద్దిరోజుల క్రితమే ఆయన్ను కలిశానని, అప్పుడు ఆయన పరిస్థితి చూడలేకపోయానన్నాడు. భగవంతుడు పిలుస్తాడని ఆరోజే అనుకున్నానని మీడియాతో మాట్లాడాడు. కోటగారంటే ఇష్టమని, ఆయన పేరు చిరస్థాయిలో నిలిచిపోతుందంటూ నటుడి మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశాడు.

**బండ్ల గణేశ్ పోస్ట్**

అయితే అదే రోజు బండ్ల గణేష్ ఓ పోస్ట్ పెట్టగా.. దానిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలారోజుల తర్వాత స్నేహితులు ఇంటికొచ్చి కలిశారంటూ ఎక్స్ (ట్విటర్)లో ఓ ఫోటో షేర్ చేశాడు. అందులో శ్రీకాంత్, శివాజీరాజా, అలీ, ఉత్తేజ్ ఉన్నారు. వీళ్లందరూ వినోదం సినిమాలో కలిసి యాక్ట్ చేశారు. దీంతో ఇది చూసిన నెటిన్లు.. మీరందరూ వినోదం సినిమాకు సీక్వెల్ తీయండి, బాగుంటుంది అని సలహాలు ఇస్తున్నారు.

**నెటిజన్స్ ఫైర్**

అయితే కొందరు మాత్రం.. పెద్దాయన (కోట శ్రీనివాసరావు) పొద్దున్నే కదా చనిపోయింది. మీరప్పుడే సిట్టింగ్ మొదలుపెట్టారా?, కానీ గ్లాసులు దాచేసి భలే కవర్ చేశారు, అయినా కోటగారు మరణించారన్న బాధ మీకు కాస్తయినా ఉంటే కదా? అని ఆగ్రహిస్తున్నారు. మరికొందరు మాత్రం.. ఫ్రెండ్స్ కలిస్తే తప్పేముందని, దానికి విమర్శలు చేయడమెందుకని బండ్ల గణేశ్‌ను సమర్థిస్తున్నారు.

## సీనియర్ నటి సరోజా దేవి కన్నుమూత



ప్రముఖ నటి, అభినయ సరస్వతి బి.సరోజా దేవి (87) కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో సోమవారం (జూలై 14న) ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈమె తెలుగు, కన్నడ, తమిళ సినిమాల్లో అనేక చిత్రాలు చేశారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎంజీఆర్, శివాజీ గణేశన్ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించారు. తెలుగులో భూకైలాస్, పెళ్లి సందడి (1959), జగదేక వీరుని కథ, సీతారామ కల్యాణం, శ్రీ కృష్ణార్జున యుద్ధం, ఆత్మబలం, శకుంతల, ఉమా చండీ గౌరీ శంకరుల కథ, పండంటి కాపురం, సీతారామ వనవాసం, దాన వీర శూర కర్ణ వంటి అనేక సినిమాల్లో నటించి మెప్పించారు.

**200కి పైగా సినిమాలు**

బీ సరోజాదేవి 1938 జనవరి 7న బెంగళూరులో జన్మించారు. "అభినయ సరస్వతి" అనే బిరుదుతో ప్రసిద్ధి పొందిన ఆమె, తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో సుమారు 200కి పైగా చిత్రాల్లో నటించారు. 1955లో కన్నడ చిత్రం మహాకవి కాళిదాసుతో ఆమె సినీ రంగ ప్రయాణం ప్రారంభమైంది. పాండురంగ మహత్యం (1957) ద్వారా తెలుగు చిత్రసీమలో ప్రవేశించారు. నాడోడి మన్నన్ (1958) ఆమెను తమిళ చిత్రసీమలో స్టార్‌గా నిలిపింది. హిందీలో పైఘామ్ (1959), ససురాల్ (1961) వంటి చిత్రాల్లో నటించారు. 1955 నుండి 1984 వరకు 161 సినిమాల్లో ప్రధాన పాత్రధారిగా నటించి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఆమె కెరీర్‌లో.. కిట్టూరు రాణి చెన్నమ్మ (1961) దేశభక్తి భావనను ప్రతిబింబించే చిత్రంగా గుర్తింపు పొందింది. సినీ రంగంలో ఆమె కృషికిగానూ కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ (1969), పద్మభూషణ్ (1992) పురస్కారాలతో సత్కరించింది. అలాగే సరోజా దేవికి కలైమామణి పురస్కారం దక్కింది. అంతేకాకుండా బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు.

**కుటుంబ నేపథ్యం**

సరోజా దేవి తండ్రి భైరప్ప పోలీసు శాఖలో ఉద్యోగి, తల్లి రుద్రమ్మ గృహిణి. 1967లో శ్రీ హర్ష అనే వ్యక్తిని వివాహం చేసుకున్నారు. ఆయన 1986లో మరణించారు. సరోజాదేవి ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుని వారికి రామచంద్రన్, ఇందిరా అని పేర్లు పెట్టి పోషించారు.

## లండన్‌లో లవ్ బర్డ్స్..
## మహ్‌వశ్ బాబీనే తీశారా చాహల్ భాయ్!

ప్రముఖ ఆర్జే మహ్‌వశ్ గత కొన్ని నెలలుగా వార్తల్లో నిలుస్తోంది. టీమిండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్‌తో కనిపించడంతో ఆమె పేరు ఒక్కసారిగా మార్మోగిపోయింది. వీరిద్దరు డేటింగ్‌లో ఉన్నారంటూ పలు సందర్భాల్లో వార్తలొచ్చాయి. కానీ తమపై వస్తున్న కథనాలపై ఇప్పటి వరకు ఎవరూ కూడా క్లారిటీ ఇవ్వలేదు. ఇటీవల కపిల్ శర్మ షోలో పాల్గొన్న చాహల్ ఇన్‌డైరెక్ట్‌గా హింట్ ఇచ్చేశాడు. తను ఎవరో మీ అందరికీ ఇప్పటికే తెలుసుగా అంటూ చాహల్ తన మనసులో మాట చెప్పేశాడు. దీంతో ఈ జంట డేటింగ్ నిజమేనంటూ నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలోనే చాహల్, ఆర్జే మహ్‌వశ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వైరల్‌గా మారాయి. లండన్‌లో ఈ ప్రేమజంట చక్కర్లు కొడుతున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరు తమ ఇన్‌స్టా వేదికగా షేర్ చేసిన ఫోటోల్లో బ్యాక్‌గ్రౌండ్‌లో లోకేషన్ ఓకేలా కనిపిస్తోంది. దీంతో ఈ లవ్ బర్డ్స్ తాజాగా లండన్‌లోనే వేకేషన్ ఎంజాయ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఫోటోలు కాస్తా నెట్టింట వైరల్ కావడంతో ఫ్యాన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. చాహల్ ఫోటోలు చూసిన ఓ నెటిజన్ మహ్‌వశ్ బాబీ తీశారా అంటూ కామెంట్ చేశాడు. వారిద్దరు డేటింగ్ చేస్తున్నారని నాకు తెలుసు అంటూ మరో నెటిజన్ రాసుకొచ్చాడు.

### చాహల్, మహ్‌వశ్‌పై డేటింగ్ రూమర్స్

క్రికెటర్ చాహల్ తన భార్య ధనశ్రీ వర్మతో విడాకులు తీసుకున్నారు. అంతకుముందే మహ్‌వశ్, చాహల్ డేటింగ్‌లో ఉన్నట్లు రూమర్స్ మొదలయ్యాయి. ఎందుకంటే ఛాంపియన్ ట్రోఫీ మ్యాచ్‌లో జంటగా కనిపించడం.. ఆ తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌ల్లోనూ పంజాబ్ కింగ్స్ టీమ్‌కు మద్దతుగా మ్యాచ్‌ల్లో సందడి చేసింది.




## కొత్త హీరోతో సినిమా..
## శ్రీలీల పారితోషికం ఎంత?

ఈ మధ్య కాలంలో సరైన హిట్స్ పడలేదు గానీ శ్రీలీల ప్రస్తుతం ట్రెండింగ్ హీరోయినే. ఈ ఏడాది మార్చిలో 'రాబిన్ హుడ్'తో వచ్చింది గానీ కలిసి రాలేదు. ఇప్పుడు కొత్త హీరో కిరీటితో కలిసి 'జూనియర్' అనే మూవీ చేసింది. రీసెంట్‌గా 'వైరల్ వయ్యారి' అనే పాట తెగ వైరల్ అవుతోంది కదా! అది ఈ సినిమాలోనిదే. ఓవైపు స్టార్ హీరోలతో కలిసి పనిచేస్తున్న ఈ బ్యూటీ.. కొత్త కుర్రాడితో చేసేందుకు రెమ్యునరేషన్ గట్టిగానే తీసుకుందనే వార్తలు వినిపిస్తున్నాయి. తెలుగు మూలాలు ఉన్నప్పటికీ శ్రీలీల.. బెంగళూరులోనే పెరిగింది. హీరోయిన్‌గా తొలి మూవీ కూడా కన్నడలోనే చేసింది. ఇప్పుడు చాన్నాళ్ల తర్వాత 'జూనియర్' మూవీతో రాబోతుంది. గాలి జనార్ధన కొడుకు కిరీటి హీరోగా పరిచయమవుతున్న చిత్రమిది. కన్నడతో పాటు తెలుగులోనూ జూలై 18న రిలీజ్ చేస్తున్నారు. కాస్తోకూస్తో హైప్ నడుస్తోంది. అయితే స్టార్ హీరోలతో సినిమాలు చేస్తున్న శ్రీలీల.. సాధారణంగా రూ.2 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటోంది. అయితే జూనియర్ కోసం మాత్రం ఈమెకు రూ.4 కోట్ల పారితోషికం ఇచ్చారనే టాక్ నడుస్తోంది. అంటే డబుల్ బొనాంజా. ఈ మూవీలో శ్రీలీల మాత్రం కాస్త చెప్పుకోదగ్గ ఫేస్. కిరీటి కొత్తవాడు. జెనీలియా చాన్నాళ్ల తర్వాత ఈ సినిమాతోనే దక్షిణాదిలోకి రీఎంట్రీ ఇస్తోంది. మరి ఈ మూవీ ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో చూడాలి? 'జూనియర్' సినిమా కోసం టాప్ టెక్నీషియన్స్ పనిచేశారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు కాగా.. రాజమౌళి చిత్రాలకు పనిచేసే సెంథిల్ కుమార్ సినిమాటోగ్రాఫర్. రాధాకృష్ణ రెడ్డి దర్శకుడు. తెలుగులో 'ఈగ' తదితర సినిమాలు తీసిన వారాహి నిర్మాణ సంస్థ ఈ మూవీని భారీ బడ్జెట్‌తో ఏ మాత్రం ఖర్చుకు వెనకాడకుండా నిర్మించినట్లు విజువల్స్ చూస్తుంటే అర్థమవుతోంది. ఈ క్రమంలోనే శ్రీలీల జాక్ పాట్ కొట్టినట్లు అనిపిస్తోంది.



## వైరల్ వయ్యారి పాటకు హీరోహీరోయిన్‌తో
## స్టెప్పులేసిన శివన్న..




ఎక్కడ చూసినా వైరల్ వయ్యారి నేనే.. పాటే వినిపిస్తోంది. ఇందులో శ్రీలీల, కిరీటి జంటగా డ్యాన్స్ చేశారు. శ్రీలీల గ్రేస్, డ్యాన్స్ గురించి తెలియంది కాదు! ఎప్పటిలాగే అల్లాడించేసింది. కానీ ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది కిరీటి గురించే! జూనియర్ ఎన్టీఆర్ అభిమాని అయిన ఈ యంగ్ హీరో.. ఆయనలాగే పవర్‌ఫుల్‌గా స్టెప్పులేశాడు. నిన్ను చూస్తుంటే తారక్‌ను చూస్తున్నట్లే ఉందని చాలామంది కిరీటపై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ఇతడు గాలి జనార్దన్ రెడ్డి కుమారుడు. జూనియర్ సినిమాతో హీరోగా పరిచయమవుతున్నాడు.

**వయ్యారి సాంగ్‌కు స్టేజీపై స్టెప్పులు**

ఈ మూవీ జూలై 18న విడుదల కానుంది. ఈ క్రమంలో బెంగళూరులో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హీరో కిరీటి శివన్నతో స్టేజీపై స్టెప్పులేయించాడు. వైరల్ వయ్యారి పాటకు స్టెప్పు ఇది.. అని ఒకసారి చూపించగనే శివన్న ఇట్టే నేర్చేసుకున్నారు. పాట ప్లే అవుతుంటే ఫుల్ జోష్‌లో డ్యాన్స్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

### జూనియర్ సినిమా విశేషాలు

ప్రముఖ వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా, శ్రీలీల హీరోయిన్‌గా నటించిన చిత్రం జూనియర్. జెనీలియా దేశ్‌ముఖ్ కీలక పాత్ర పోషిస్తోంది. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలన చిత్రం పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈగ, బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలకు పని చేసిన కేకే సెంథిల్ కుమార్ జూనియర్ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతమందిస్తున్నారు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034